10-1-51

"సంసారం"

పాటలు, మాటలు: సదాశివబ్రహ్మం, కే. గోపాలరాయశర్మ, సంగీతం: సుసర్ల దక్షిణా మూర్తి, ఫోటోగ్రఫీ: రహమాన్, బి. సుబ్బారావు, డైరెక్షన్: ప్రసాద్.

నటీనటులు: ఎన్. టి. రామారావు, ఎ. నాగేశ్వరరావు, రాజ్యం, పుష్పలత, రేలంగి, సురభి బాలసరస్వతి, బెజవాడ కాంతమ్మ, సూర్యకాంతం, దొరస్వామి, రంగస్వామి వగైరా.

ఇటీవలనే ఆంధ్రదేశమంతటా విడుదల అయిన శ్రీ సాధనాపిక్చర్స్‌వారి తొలి, సాంఘిక చిత్రం "సంసారం", జనవరి 4 ఉదయం 9న్నర గంటలకు మద్రాసు శ్రీ కృష్ణాటాకీసులో పత్రికా విలేఖరులు మొదలైనవారికి చూపబడింది. కొత్తగా చిత్రనిర్మాణానికి దిగిన ఈసంస్థ ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొని ఈ చిత్రాన్ని



సాధనావారి 'సంసారం' లో పుష్పలత, నాగేశ్వరరావులు.

తీసినదీ, జ్ఞాపకం రాకుండా ఈ చిత్రాన్ని ఎవరూ చూడలేరని చెప్పవచ్చు. అట్టి ఇబ్బందులలోకూడా, ఉత్తమ తరగతికింద చేర్చదగిన "సంసారం" తయారుచేసి విడుదల చేయగలిగినందుకు సాధనావారు అభినందనీయులు.

ఈ "సంసారం" అచ్చగా ఒక కుటుంబానికి చెందినది కాదు. రఘు (ఎన్. టి. రామారావు) సంసారానికి అనుబంధంగా అతని తమ్ముడైన వేణు (ఏ. నాగేశ్వరరావు) సంసారమూ, అతని చెల్లెలి భర్త అయిన సీతారాం (రేలంగి) సంసారమూ కూడా చిత్రంలో చిత్రించబడ్డాయి. సంసార విచ్ఛిత్తికి మూలశక్తులకు ప్రతినిధులుగా రఘు తల్లీ, రఘు చెల్లెలు కామాక్షీ చిత్రంలో చూపబడినప్పటికీ వారు సంఘంలోవున్న దుష్టశక్తులను చాలా సమగ్రంగానే ప్రతిబింబించారు. అట్లాగే రఘూ, వేణూ సంఘంలో ఉన్న మంచితనానికి ప్రతినిధులుగా నిలిచారు.

ఒకవంక పాషాణహృదయాలు, వంచనా హింసా, అసత్యమూ, రెండోవంక ప్రేమా, సహనమూ, మంచితనమూ ఈ చిత్రంలో ఒకదానికొకటి పోటీ చేయబడినవి. సంఘంలోని అసమర్థతకు ప్రతినిధిగా సీతారాం పాత్ర నిలబెట్టబడింది.

ఈ చిత్రంలో కథ వాస్తవికదృష్టితో చూస్తే విమర్శకు నిలిచేదికాదు. పాత్రపోషణకూడా నిర్దుష్టంగా లేదు. ఒక ఉదాహరణ: ధనికుడైన కమల తండ్రి, తన కుమార్తె ఎవరో పల్లెటూరి "చైతు"ను, అందులోనూ నిరక్షరుణ్ణి, పెళ్లాడబోతుందని తెలిసి ఆపే అభ్యంతరం చెప్పక ఏళ్ల అనంతరం తన కుమార్తెకు ఇంకొక వరుణ్ణి చూసి, అకస్మాత్తుగా ఆమెపెళ్లికి గడువు ఏర్పాటుచేసి ససేమిరా అంటాడు. తాను ప్రేమించిన వాణ్ణి పెళ్లాడాలనే తహతహ కమలకు ఉండటం సబబేగాని, ఆమె ప్రేరేపణ ఏమీ లేకుండానే తండ్రి తహతహలాడటం భావ్యంగా లేదు. సన్నివేశాలలో కూడా అస్వాభావికత లేకపోలేదు. కన్న తల్లీ, తోడబుట్టువూ కలిసి నిర్విచారంగా రఘూ కాపరం కూలదోయ్యటమూ, వేణుకు రంకులు కట్టటమూ అట్టే స్వాభావికంగా లేదు. కథ కిదే ఆయువుపట్టు.

అయినప్పటికీ ఈ కథలో సినిమాచిత్రాని కుండదగిన సన్నివేశాలూ, వసికా విరివిగా లభించింది. అందుచేత, చిత్రం చాలా దీర్ఘమైనప్పటికీ ఎప్పటి కప్పుడు కొత్త వైవిధ్యం కథలో ప్రవేశిస్తుంది. సన్నివేశవైవిధ్యం వల్ల కలిగిన మరొక మేలేమంటే ప్రాముఖ్యమంతా అచ్చగా ఏ ఒకటిరెండు పాత్రలకో ఇవ్వక అప్రధాన పాత్రలను సయితం ఆకర్షవంతంగా చిత్రించటానికి వీలయింది. రఘూ, మంజూ, వారి పిల్లలూ పడే కష్టాలతోపాటు, సీతారాం, అతని తల్లీ చేసే కోతిచేష్టలూ వేణూ, కమలా, ఆమె స్నేహితురాళ్లూ చేసే అల్లరీ చిత్రంలో రక్తికి తీసుకురాబడ్డాయి. ప్రతి సంభాషణా గొప్పగా లేనప్పటికీ మొత్తంమీద సంభాషణలు సినిమాచిత్రానికి ఉండదగినట్టుండటమే కాక, తెలివిగా కూడా ఉన్నాయి. సంభాషణలలో వ్యంగ్యంగా కూడా అశ్లీలాలు లేకపోవటం మరొక సుగుణం.

చిత్రానికున్న ప్రధానలోపం పొడవు. ఆకర్షవంతమైన సన్నివేశాలుండటంచేత చిత్రం పొడవైతే అంతపట్టింపు లేకపోను. ఈ చిత్రం కేవలం సన్నివేశాలచేతనే గాక అనవసరమైన పాటలతోకూడా పెరిగిపోయింది. ముఖ్యంగా రాజ్యం పాడిన పాటలలో చాలాభాగం నిరుపయోగమే కాక కథా గమనాన్ని పూర్తిగా నిరోధించాయి. అదేవిధంగా రేలంగి, సురభి బాలసరస్వతీ పాడుతూ చేసిన పడికగడి నృత్యం తీసివెయ్యవచ్చు.

పాటలను గురించి ఇంకొక విమర్శకూడా చెయ్యవలసివున్నది. ఇటీవల వచ్చిన హిందీ సినిమాగీతాలను చాలావాటిని అనుకరించారు. ఈ అనుకరణవల్ల చిత్రానికి లాభం ఏమీ ఉండదు. హిందీ మట్టులను మక్కీకిమక్కీ కాపీకొట్టటంవల్ల చిత్రానికి చౌకబారుతనం కూడా సంక్రమిస్తుంది. హిందీ సంగీతపు ఛాయలు బాగున్నప్పుడు వాటిని సొంతం చేసుకుని మట్లు నిర్మించుకోవటం మంచిది గాని హిందీ జాతీయత ముఖానగుద్దినట్టుండే మట్లను కాపీ కొట్టటం తగినపని కాదు.

చిత్రంలో తగినంత హాస్యం ఉండటంచేతనే కథ ప్రేక్షకులకు భారమనిపించటం లేదు. హాస్యనటుడుగా ముద్రపడిన రేలంగితో సరిసమానంగా నాగేశ్వరరావూ, రఘూ తల్లిపాత్ర ధరించిన బెజవాడ కాంతమ్మా, కామాక్షీ పాత్ర ధరించిన సురభి బాలసరస్వతీ, సీతారాం తల్లి పాత్ర వహించిన సూర్యకాంతం కూడా చక్కని హాస్యం ఒప్పించారు.

ఇతరనటులలో రఘు పాత్ర ధరించిన ఎన్. టి. రామారావు చాలా నటనా సామర్థ్యం కనబరచాడు. పూర్వం "స్వర్గసీమ"లో నాగయ్యవంటి అనుభవశాలి ధరించిన మూర్తి పాత్రవంటిది రఘూపాత్ర. అటువంటి పాత్రను సమర్థతతో నిర్వహించి రామారావు తెలుగుసినిమా నటులలో అగ్రశ్రేణిలో చేరటానికి అర్హత పొందాడనవచ్చు. రాజ్యంకూడా అతిక్లిష్టమైన మంజూ పాత్రను సమర్థతతో నిర్వహించింది. కాని చిత్రంలో ఆ పాత్రకు ఉండదగినంత ప్రాముఖ్యం లేకపోయింది. ఆమెకు నిజంగా మంచి అవకాశం లభించిన ఆఖరి దృశ్యాలలో ఆమె నటన అసమానంగా ఉన్నది.

నటులందరిలోకీ కమలపాత్ర ధరించిన పుష్పలతా, డా. దామోదరం పాత్ర ధరించిన సుందరరావూ బలహీనంగా ఉన్నారు. కొద్దిసేపే తెరమీద కనిపించినప్పటికీ, మంజూ తండ్రిగా నటించిన రంగస్వామీ, డాక్టరుపాత్ర ధరించిన దొరస్వామీ మంచి నటనా కౌశలం ప్రదర్శించారు.

డైరెక్షనులో ప్రసాద్ ప్రత్యేకత మళ్లీ ఈ చిత్రంలో కొట్టినట్టు కనిపిస్తున్నది. స్క్రిప్టు రూపంలో కాగితంమీదవున్న దృశ్యాన్ని సెల్యులాయిడ్ మీదికి ఎక్కించేటప్పుడు అదృశ్యానికి జీవం ఇచ్చే రహస్యం ప్రసాద్‌కు తెలిసినట్టుగా చాలామంది డైరెక్టర్లకు తెలియదు. క్రిక్కుళ్లోని పెద్దలోపాలను డైరెక్షనులో కప్పిపుచ్చటం ఏ డైరెక్టరుకూ సాధ్యం కానిపని. కాని నిర్జీవ సన్నివేశాన్ని వాస్తవికసంఘటన అనిపించేలాగు చేసే కళాసృష్టి ప్రసాద్ చేతిలో ఉన్నది.

ఈ చిత్రానికి కెమెరామెన్‌గా పనిచేసిన రహిమాన్, బి. సుబ్బారావులు చాలావరకు నిపుణతతో పనిచేశారు. కాని ఎడిటింగ్ ఉండదగినంత నిర్దుష్టంగా లేదు. అయితే దీనికి బాధ్యులెవరో ఊహించటం కష్టం. రాజ్యంచేత పాడించిన పాటలు (లీల పాటలకు ప్లేబాక్) సరిగా "సింక్" కాలేదు.

ఎన్ని లోపాలున్నప్పటికీ "సంసారం" చెప్పుకోదగిన చిత్రం. ఇది ప్రజాదరం విశేషంగా పొందగలది, పొందదగినది. సాంఘిక చిత్రాలకు గిరాకీ తక్కువగా ఉన్నరోజులలో మంచి సాంఘికచిత్రం నిర్మించిన సాధనావారు ఎంతైనా అభినందనీయులు.